# మరమ్మతుల ఊసే లేదు..

ప్రభుత్వం అధికారులకు ప్రత్యేకంగా వాహనాలు కేటాయిస్తుంటుంది. బాధ్యతల రీత్యా వారు ఒక చోటు నుంచి మరో చోటికి వెళ్లాల్సి రావటం.. క్షేత్ర సందర్శనకు పలు ప్రాంతాలు చుట్టి రావాలి కనుక పైస్థాయి అధికారులకు ప్రభుత్వ వాహనాల కేటాయింపు జరుగుతుంది. అటువంటి వాహనాలు బాగున్నంతసేపు ఫర్వాలేదు కానీ.. వాటికి ఏ చిన్న మరమ్మతు వచ్చినా కాస్త సమయం కేటాయించి రిపేరు చేయించాల్సింది పోయి ఏకంగా వాటిని మూలన వదిలేస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది.



మూలకు చేరి తుప్పు పట్టిపోతున్న జీపు

- పెడ్లు, తుప్పలకే పరిమితమైన ప్రభుత్వ వాహనాలు
- తుప్పు పట్టిపోతున్నా స్పందించే నాథుడే లేడు
- లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం



ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో మూలకు చేరిన 104 వాహనం

డాబాగార్డెన్స్: చాలా మంది పాత వస్తువులు భద్రపరుస్తుంటారు. వాటి విలువ తెలిసిన వారు కొందరైతే.. పురాతన వస్తువులు భద్రపరచుకోవడం ఒక అలవాటుగా మరికొందరు.. సెంటిమెంట్‌గా ఇంకొందరు ఆయా వస్తువులు ఇళ్లల్లో భద్రపరుచుకుంటుంటారు. పాతవస్తువుల్ని ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటారు. అందుకనే చాలా మంది అలవాటుగా ఇంట్లోనే ఆయా వస్తువులను ప్రత్యేకంగా దాచుకుంటూ ఉంటారు. కానీ.. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండే వస్తువులు.. అధికారులు వినియోగించే వాహనాలకు ఇంట్లో మనం తీసుకునేటంత భద్రత ఉండదు. ఎందుకంటే.. ఈ వాహనం పోతే.. మరో వాహనం.. అది కూడా మూలకు చేరితే ఇంకో వాహనం వస్తుంది తప్ప.. పాత వాహనం మరమ్మతులకు గురైతే దాన్ని బాగు చేయించి వాడుకోవాలనే పద్ధతి కనిపించదు. ఏమాత్రం మరమ్మతుకు గురైనా అటువంటి వాహనాన్ని మూలకు తోసేయడం పరిపాటిగా మారింది. చిన్నపాటి లోపం (మరమ్మతు) వస్తే ఆ వాహనం ఇక పూర్తిగా పని చేయదు అన్న భావనలో కొందరు అధికారులుంటున్నారు. లేదా కొత్త వాహనాలు వస్తే.. పాత వాటిని కార్యాలయ ప్రాంగణంలో ఏదో మూలకు తోసేసి వదిలేస్తుంటారు. అవి ఎండకు ఎండి.. వానకు తడిసి పాడైనా పట్టించుకునే నాథుడు.. అడిగే పుణ్యాత్ముడు లేకుండా పోవడంతో విలువైన వాహనాలు తుప్పుపట్టి పోతున్నాయి. విషయానికొస్తే.. అగ్నిమాపక కేంద్రాలకు గతంలో గంటల్లారీలుండేవి. ప్రస్తుతం అధునాతన వాహనాలు వచ్చేసాయి. దీంతో పాతనగరంలో గతంలో ఉండే అగ్నిమాపక కార్యాలయం వద్ద ఓ యంత్రం మరమ్మతులకు గురైనట్టుంది. దీంతో ఆ శాఖ అధికారులు



పాతనగరంలో మూలన వదిలేసిన అగ్నిమాపక యంత్రం

దానిని మూల పడేసి.. ఎగ్జిబిషన్ (ప్రదర్శన)రీతిన వదిలేశారు. ఇప్పుడైతే ఆ కార్యాలయాన్ని కూడా అక్కడి నుంచి తరలించేశారనుకోండి. అలాగే జీవీఎంసీకి చెందిన పలు వాహనాల్ని కూడా ఇందిరా ప్రియదర్శినీ మున్సిపల్ స్టేడియంలో మూలకు చేర్చేశారు. చివరకు 108.. 104 వాహనాలు కూడా స్టేడియంలో ఓ మూలన పడి ఉన్నాయి. అలాగే అధికారుల జీపులు.. మరమ్మతులకు గురైన పలు వాహనాలు మూలకు చేరాయి. అవి ఎండకు ఎండి.. వానకు తడిసి తుప్పుపట్టి లక్షలాది రూపాయల ప్రజా ధనం నిరుపయోగమవుతోంది. ఇదంతా చూసిన వారు స్పందించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారంటూ నిట్టూరుస్తున్నారు.

## ‘జగనన్నే మా భవిష్యత్’పై సమీక్షా సమావేశం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్‌కాలనీ, సుబ్బలక్ష్మీనగర్ సచివాలయాల పరిధిలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ నేతృత్వంలో శనివారం ‘జగనన్నే మా భవిష్యత్’పై సమావేశం నిర్వహించారు. వార్డులో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. క్లస్టర్ పరిధిలో వలంటీర్లు గడపగడపకు సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. అభివృద్ధి పనులపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు శౌరీ, పాత్రపల్లి సునీల్‌కుమార్, చిరంజీవి, దేవి, ఈశ్వరి, వేశంగిణీరావు, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కుమార్, ఆనంద్, అన్నపూర్ణ, నాయకులు కల్యాణ్, ప్రసాద్, కుమార్, కమల్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్నకోడిగుడ్ల శ్రీధర్

## స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఎన్నాళ్లయినా పోరాడతాం

సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు బీజేపీ ప్రభుత్వం ప్రకటించే వరకు ఎన్ని సంవత్సరాలైనా ఉద్యమం కొనసాగిస్తామని జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల గురజాడ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జగ్గునాయుడు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజలు చేస్తున్న పోరాటం వృథా కాలేదన్నారు. రెండు సంవత్సరాలు పూర్తి అయినా మోదీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ అమ్మకంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందన్నారు. ఇది కార్మికులు, ప్రజలు చేసిన పోరాట ఫలితమే అన్నారు. మోదీ ప్రభుత్వం మెడలు వంచి స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిలిపేసే వరకు ఈ పోరాటం సాగుతుందన్నారు. అనంతరం ప్రజా నాట్య మండలి కళాకారులు ఆలపించిన గేయాలు, డప్పు కళాకారుల నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల యూనియన్ నాయకులు, అసంఘటిత రంగ కార్మికులు, వైస్ చైర్మన్ పడాల రమణ, బి.నాగభూషణరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఎస్.కనకారావు, కె.లోకనాథం, వై.నాయినబాబు, కె.సుధాకర్, సత్యవతి, యుఎస్ఎన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్మిక సంఘాల నాయకులు

## ‘చలో ఢిల్లీ’కి కార్మిక నాయకులు

తాటిచెట్లపాలెం: ఢిల్లీలో ఈ నెల 5న జరగనున్న కార్మిక, కర్షక సంఘర్ష్ ర్యాలీకి విశాఖ నుంచి కార్మిక నాయకులు శనివారం ఉదయం సమతా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్లారు. సుమారు వంద మంది భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులు తరలి వెళ్లారు. వీరికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు, కార్మిక చట్టాల తొలగింపు, కనీస వేతనం, కొత్త పెన్షన్ విధానం రద్దు కనీస మద్దతు ధర వంటి పలు అంశాలపై ఢిల్లీలో ర్యాలీ జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు తులసి, అప్పలరాజు, అనసూయ, నాయకులు బి.వెంకటరావు, శంకరరావు, దేవి, బృంద, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీకి బయలుదేరి వెళుతున్న కార్మిక నాయకులు

## ఎనస్తీషియాలజీపై అవగాహన

మహారాణిపేట : ఎనస్తీషియాలజీ విభాగం ఆధ్వర్యంలో పీజీ ఇంపాక్ట్–2023 ఎకడమిక్ ప్రోగ్రాం నగరంలోని ఏఎంసీలో నిర్వహించారు. ఎనస్తీషియా విభాగం, ఆంధ్రా మెడికల్ కాలేజీ, ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియాలజీ (ఐఎస్ఏ–ఏపీ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహించనున్నాయి. తొలిరోజు శనివారం ఈ కార్యక్రమానికి మొత్తం 250 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. రాష్ట్రం నలుమూలల నుంచి నిపుణులు హాజరయ్యారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీజీలకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. అశోక్‌కుమార్, పరిశీలకురాలు డాక్టర్ కె.శిల్ప, ఏపీ మెడికల్ కౌన్సిల్, ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ ఎ.పద్మజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వి.రవి, చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ. ప్రశాంతి, సెక్రటరీ డాక్టర్ అచ్యుతరామయ్య, ఐఎస్ఏ నేషనల్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె. కుచేలబాబు, డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు, డాక్టర్ కేఆర్ఎస్‌ఠాగూర్, అధ్యాపకులు, ఎనస్తీషియాలజీకి చెందిన దాదాపు 225 మంది పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



హాజరైన వారికి జ్ఞాపికలు అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

## 8న ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 8న నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం కళాశాల అల్యూని అధ్యక్షుడు అజ్జరాపు సర్వేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించి తీర్మానించారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు. పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి మాకాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ‘ప్రజాధనం దుర్వినియోగం’

డాబాగార్డెన్స్: విశాఖ మహానగరంలో 4 రోజుల పాటు ఆర్భాటంగా జీ–20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ నిర్వహించిన సమ్మిట్ పట్టణ మౌలిక సదుపాయాలను పూర్తిగా ప్రైవేట్‌పరం చేయాలనే నిర్ణయాలతో ముగించడం ఆందోళన కలిగిస్తుందని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి. గంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సుకు జీవీఎంసీ ఏకంగా రూ. 159 కోట్లు ఖర్చు చేసిందని, ఇది దుర్వినియోగం కిందకే వస్తుందన్నారు.

## పది పరీక్షల్లో తనిఖీ అధికారుల ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్‌లపై ఉందని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ టీమ్‌లో నియమితులైన అధికారులతో శనివారం క్వీన్ మేరీ హైస్కూల్లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తనిఖీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో డీఈవో కార్యాలయం నుంచి డ్యూటీ వేసిన వారు మాత్రమే విధులు నిర్వహించాలన్నారు. ప్రైవేటు స్కూళ్ల మేనేజ్‌మెంట్ వారు, కరస్పాండెంటింట్, హెచ్ఎం ఎవరూ ఉండటానికి వీల్లేదన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీమోహన్, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, డీసీఈబీ సెక్రటరీ కృష్ణకుమార్, ఏపీవో అప్పలనాయుడు, భీమరాజు పాల్గొన్నారు.

## బీఈడీ విద్యార్థులకు కాగ్నిజెంట్ స్కాలర్‌షిప్‌లు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసింది. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రస్తుత బ్యాచ్‌లో 10 మందికి స్కాలర్‌షిప్ మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులను అందించింది. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.35 వేల చొప్పున రెండేళ్లకు రూ.70 వేలు కాగ్నిజెంట్ ఫౌండేషన్ అందిస్తుంది. స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శనివారం అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారు. 34వ వార్డు ఎస్‌వీపీనగర్ (కొబ్బరితోట)లో నివాసం ఉంటున్న గరికిన నూకరాజు ఇటీవల ప్రమాదవశాత్తు కాలు జారి మెట్లపై నుంచి పడిపోవడంతో మక్కకి శస్త్ర చికిత్స చేశారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఎమ్మెల్యే దృష్టికి రావడంతో నూకరాజు ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే అదే వార్డులో ఉంటున్న పార్టీ కార్యకర్త, గృహసారథి పెట్ల కుంచేశ్వరరావు గుండెజబ్బుతో ఇటీవల మృతి చెందారు. ఆ సమయంలో ఎమ్మెల్యే అసెంబ్లీ సెషన్స్‌లో ఉన్న కారణంగా హాజరు కాలేకపోయారు. శనివారం కుంచేశ్వరరావు ఇంటికి వెళ్లి తన సొంత నిధుల నుంచి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, పార్టీ నాయకులు లింగం శ్రీను, లండా రమణ, బొగ్గు శ్యామ్, బోణి దేవా, పాల శ్రీహరిరెడ్డి, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నూకరాజు కుటుంబ పోషణకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

## నిత్యావసర సామగ్రి పంపిణీ

డాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ సమీపాన గల వికలాంగుల మహిళా సమైక్య భవన్‌లో 29వ వార్డు నాయకుడు బొట్ట రాము నేతృత్వంలో నెలకు సరిపడా కిరణా సామాన్లు అందజేశారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ చేతుల మీదుగా నిత్యావసర సరకులు అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేసి పార్టీకి మరింత సేవ చేయాలని జాన్‌వెస్లీ అభిలషించారు. అనంతరం మన్యాల యువసైన్యం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమీపాన గల సెయింట్ జోసెఫ్ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మన్యాల అభిమానులు పాల్గొన్నారు.



మహిళా సమైక్య భవన్‌లో కిరాణా సామాన్లు అందజేస్తున్న జాన్‌వెస్లీ, మన్యాల శ్రీనివాస్

## సెయింట్ జోసెఫ్‌లో వీడ్కోలు వేడుకలు



వీడ్కోలు వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



విజేతలతో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థినులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా పీస్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ ఎస్.లక్ష్మి పాల్గొని మాట్లాడారు. అమ్మాయిల్లోని విజ్ఞానం సమాజాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. కళాశాలను వీడిన తర్వాత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వివిధ గ్రూపుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, డాక్టరేట్ సాధించిన లెక్చరర్లను ఘనంగా సత్కరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. మిస్ సెయింట్ జోసెఫ్ పోటీల్లో విన్నర్‌గా వైష్ణవి, రన్నర్‌గా లక్ష్మీప్రసన్న నిలిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, డాక్టర్ లక్ష్మీప్రభ, సిస్టర్ రోజ్, ఆచార్య మంగవేణి, డాక్టర్ రమణి, కళాశాల పీఆర్‌వో డాక్టర్ పీకే జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రెండు పీహెచ్‌సీలను సందర్శించిన డీఎంహెచ్‌వో

మహారాణిపేట: కంచరపాలెం సమీపంలోని ఏఎస్సార్ నగర్, కప్పరాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాల సెషన్‌ను సందర్శించారు. ఈ–సంజీవనిని తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్‌డీసీ సర్వే, గర్భిణులకు టీటీ అందజేయాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ల సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలని, వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్‌వో సూచించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, బయోమెట్రిక్ హాజరు వేయాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రజలను ప్రోత్సహించి అవగాహన కల్పించాలని చెప్పారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది అందరూ డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. సందర్శనలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



బిడ్డను ప్రసవించిన మహిళతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

## బీజేపీ నేతలపై దాడిని ఖండిస్తున్నాం

డాబాగార్డెన్స్: అమరావతి రైతుల ఉద్యమానికి సంఘీభావం తెలిపి వస్తున్న బీజేపీ నేతల కార్లపై రాళ్లతో దాడి చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఆ పార్టీ నాయకులు డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకోవాలని, రేపు ఏ నాయకులు ఆంధ్రాకు వచ్చినా ఇదే పరిస్థితి దాపురిస్తుందని మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎం. రవీంద్ర, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్, యువమోర్చా అధ్యక్షుడు సురేంద్రమోహన్, ఉమ్మడి సుజాత, పరశురామరాజు, మంచా నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

## పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

సీతంపేట : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంఘం ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం సమావేశం స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.బి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్పంచులు ఎవరూ విద్యుత్ బిల్లులు కట్టవద్దన్నారు. సర్పంచుల సంతకం లేకుండా 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లు నిధులు దారి మళ్లించిందని విమర్శించారు. సర్పంచుల విధులు, నిధులు, అధికారాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ సర్పంచుల గౌరవ వేతనం రూ.15వేలకు, జెడ్పీటీసీ, ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణా సర్పంచుల సంఘం ప్రెసిడెంట్ వై.నాగేంద్ర మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా పర్యటించి సర్పంచుల విధులు, అధికారాలపై చైతన్య పరిచేలా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉత్తరాంధ్ర జిల్లాల సర్పంచులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆశిపాపవీధిలో అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధి ఆశిపాపవీధిలో వెలసిన సత్యపోలమాంబ పరస మహోత్సవంలో భాగంగా శనివారం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, కోరుకొండ సూర్యప్రసాద్, అలమండ విజయ్, ఒదూరు వేణు, సాగర్, నల్లబాబు, ఆకుల యేసు, రమణ, కాసారపు వాసు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### సీనియర్ వాకర్ సభ్యుడికి సత్కారం



ఓడరేవు సింహాచలాన్ని సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అల్లిపురం: నగరంలోని 31వ వార్డులో గల సరస్వతీ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు ఓడరేవు సింహాచలం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సింహాచలం అసోసియేషన్‌కు చేసిన సేవలు కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు అల్పాహారం అందజేశారు. మహిళలకు గాజులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు లింగం శ్రీను, శివ, రామారావు, బండారు శ్రీను, రమేషన్, అబ్దుల్ చినరహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



ప్రైవేటు ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : శనివారం మెడికవర్, కృష్ణ ఆస్పత్రులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తనిఖీ చేశారు. ఇన్ పేషెంట్ల రికార్డులు, రోగుల కేస్‌షీట్లు పరిశీలించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి, గణాంక అధికారి మురళీకృష్ణ, పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

### 9న మానవ హక్కుల కౌన్సిల్ సమావేశం

డాబాగార్డెన్స్: మానవ హక్కుల కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సమావేశంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా సన్యాసిరావు పలువురు సభ్యులను సన్మానించనున్నట్టు చెప్పారు. మానవ హక్కుల కమిషన్, మానవ హక్కుల కోర్టుల పనితీరుపై చర్చా కార్యక్రమంలో న్యాయ నిపుణులు, మేధావులతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల హ్యూమన్ రైట్స్ డిఫెండర్లు పాల్గొంటారని శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.